సాక్షి మహబూబ్‌నగర్

శనివారం ¦ 2 ¦ నవంబర్ ¦ 2024



తరలివచ్చిన భక్తులు
కురుమూర్తి జాతర నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.
వివరాలు 8లో ►



నాణ్యమైన విద్య..
సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆకునూరి మురళి అన్నారు.
వివరాలు 10లో ►

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36.5/20.2
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

8, 9 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

జడ్చర్ల టౌన్: ఈనెల 8, 9 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో సీపీఎం 20 జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్చర్లలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, దళితులు పెద్ద ఎత్తున సభలకు హాజరు కావాలని కోరారు. మహాసభలో అనేక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామని, ముఖ్యంగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లకు సంబంధించిన రైతులు, నిర్వాసితులకు జరిగిన అన్యాయంపై చర్చించనున్నామన్నారు. సభలకు సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నాయకులు జాన్‌వెస్లీ, సాగర్, జయలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కిల్లెగోపాల్, దీప్లానాయక్, జగన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లావ్యాప్తంగా దీపావళి వేడుకలను గురు, శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. సంబరాలు అంబరాన్నంటాయి. రోజంతా పూజలతో గడిపిన ప్రజలు రాత్రి బాణాసంచా మోతతో హోరెత్తించారు. ఇళ్లల్లోనే కాకుండా అన్ని వ్యాపార కేంద్రాలు, షాపుల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంతిపూల తోరణాలు, దీపాల వెలుగులతో పట్టణాలు కళకళలాడాయి. ఇళ్లముందు చిచ్చుబుడ్లు, ఆకాశంలో తారా జువ్వలు, చిన్నారుల చేతుల్లో కాకరపువ్వొత్తులు, యువకులు కాల్చే పటాసులతో ఆనందం వెల్లివిరిసింది.

6 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేశ్, సూరిబాబు శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువలో కలిపి 620 మి.యూ. విద్యుదుత్పత్తి లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 647 మి.యూ. చేపట్టి లక్ష్యాన్ని అధిగమించామని చెప్పారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి అధికంగా వరద చేరుతుండటంతో నిరంతరాయంగా ఉత్పత్తి చేపడుతున్నామన్నారు. ఎగువలో 330 మి.యూ. ఉత్పత్తి లక్ష్యంగా 331.198 మి.యూ., దిగువలో 290 మి.యూ. లక్ష్యం కాగా.. 316.725 మి.యూ. ఉత్పత్తి సాధించామన్నారు. శుక్రవారం ఎగువ 3 యూనిట్ల నుంచి 117 మెగావాట్లు, దిగువ 3 యూనిట్ల నుంచి 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు. ప్రస్తుతం 21,919 క్యూసెక్కుల నీటిని విద్యుదుత్పత్తికి వినియోగించి దిగువ శ్రీశైలంకు వదులుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల కార్యక్రమం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ నెల 3వ తేదీన జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగదారుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులోభాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని విద్యుత్‌భవన్‌లో, జడ్చర్ల, రాజాపూర్, దేవరకద్ర సబ్ డివిజన్ల కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఆదా చేయడం, నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడడం, విద్యుత్ టారిఫ్‌ల వివరాలను పొందవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు, అధిక బిల్లులు, పేరు మార్పిడి చిరునామా మార్పిడిలో ఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కాలిపోయిన నియంత్రికల తదితర సమస్యలపై ఫిర్యాదు అందించి పరిష్కారం పొందవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లా విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలమూరు ఎత్తిపోతల వద్ద సర్జ్‌పూల్



ఎల్లూరు లిఫ్టులో ఏర్పాటు చేయనున్న మోటార్లు	9
ఒక్కో మోటార్ సామర్థ్యం	145 మెగావాట్లు
ఒక మోటార్ ద్వారా రోజూ ఎత్తిపోసే నీళ్లు	3,000 క్యూసెక్కులు
నార్లాపూర్ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం	6.4 టీఎంసీలు
ఈ ఏడాది తాగునీటి అవసరాల కోసం ఎత్తిపోసుకునేందుకు అనుమతి ఉన్న నీటి వాటా	4 టీఎంసీలు

‘పాలమూరు’ ఎత్తిపోతలు 2 నెలల తర్వాతే..

- పంప్‌హౌజ్‌లో కొనసాగుతున్న పనులు
- ఇప్పటికే నాలుగు పంపుల ఏర్పాటు పూర్తి
- మరో రెండు పంపుల బిగింపునకు కసరత్తు
- నీటి పంపింగ్ చేపడితే పనులకు ఆటంకం అంటున్న అధికారులు
- ఈ ఏడాది నాలుగు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం


కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు చేపట్టేందుకు మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. కృష్ణానదికి ఉధృతంగా వరదలు వస్తున్నప్పటికీ ప్రాజెక్టు పంపుహౌజ్‌లో పనులు కొనసాగుతుండటంతో నీటిని ఎత్తిపోయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాలనే తలంపుతో ఉన్న అధికారులు నీటి ఎత్తిపోతలకు కొంత సమయం వేచి ఉండడమే మంచిదనే యోచనలో ఉన్నారు.

4 టీఎంసీలకు అవకాశం

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నాలుగున్నరేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. గతేడాది సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎల్లూరు సమీపంలోని మొదటి లిఫ్టును ప్రారంభించారు. ఒక మోటార్ ద్వారా 2 టీఎంసీల నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే వెసులుబాటు ఉంది. కృష్ణానదికి రెండు నెలలుగా ఉధృతంగా వరదలు వస్తున్నప్పటికీ పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు చేపట్టడం లేదు. ఎల్లూరు పంపుహౌజ్‌లో పనులు కొనసాగుతుండటంతో నీటి పంపింగ్ ఇప్పుడే చేపట్టకూడదని అధికారులు నిర్ణయించారు.

ఉన్నత స్థాయిలో సమీక్ష

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం, మేడిగడ్డతో పాటు పాలమూరు ప్రాజెక్టుపై ఉన్నత స్థాయి సమీక్షలు జరిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల గురించి ఉన్నతాధికారులతో చర్చించారు. సెప్టెంబర్‌లో ఆయన జిల్లాలోని ప్రాజెక్టులను సందర్శించి.. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్షించారు. పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



పాలమూరు ప్రాజెక్టులోని ఎల్లూరు పంపుహౌజ్

ముమ్మరంగా మోటార్ల బిగింపు

ప్రాజెక్టు ప్రారంభం నాటికి ఎల్లూరు పంపు హౌజ్‌లో రెండు మోటార్లను బిగించారు. ఒక పంపునకు విద్యుత్ సప్లయ్, చార్జింగ్ పనులన్నీ పూర్తిచేసి నీటి ఎత్తిపోతలు చేపట్టారు. నీటి ఎత్తిపోతలు ముగిశాక మిగిలిన మోటార్ల బిగింపు పనులు చేపట్టారు. ఇప్పటి వరకు నాలుగు మోటార్ల బిగింపు పనులన్నీ పూర్తయ్యాయి. మిగతా మోటార్ల ఏర్పాటు పనులు సైతం జరుగుతున్నాయి. మోటార్లకు విద్యుత్ సరఫరా తదితర సాంకేతిక అంశాలను నిపుణులైన ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారు. అప్రోచ్ చానల్ నుంచి సర్జ్‌పూల్‌లోకి నీళ్లు వచ్చే ప్రాంతంలో 9 గేట్లు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు. టన్నెల్ ప్రాంతంలోని సివిల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. సర్జ్‌పూల్ నుంచి పంప్ హౌజ్ వరకు పనులన్నీ పూర్తిచేసిన తర్వాత నీటి పంపింగ్ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

తుది దశలో పనులు



ఎల్లూరు లిఫ్టులో నాలుగు మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. సర్జ్‌పూల్ వద్ద గేట్లకు సంబంధించి పనులు తుది దశలో ఉన్నాయి. సర్జ్‌పూల్ నుంచి పంప్ హౌజ్ వరకు పనులన్నీ పూర్తి చేసిన తర్వాతే ఎత్తిపోతలు ప్రారంభిస్తాం. పనులు పూర్తికాకుండా సర్జ్‌పూల్‌లో నీటిని నింపితే తర్వాత వాటిని ఖాళీ చేసి, మిగిలిన పనులు పూర్తిచేసేందుకు చాలా సమయం పడుతుంది. అందుకే పనులన్నీ పూర్తయిన తర్వాతే నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించాం. ఈ పనులు పూర్తయ్యేందుకు రెండు నెలల సమయం పట్టొచ్చు.
– విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ

పెరిగిన ఓటర్లు



- జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- అసెంబ్లీ ఎన్నికల కంటే 79,602 ఓటర్లు పెరుగుదల
- కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం

ముసాయిదా ప్రకారం జిల్లాలో ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
మహబూబ్‌నగర్	129531	132274	14
జడ్చర్ల	111649	112672	6
దేవరకద్ర	118997	121843	0

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటి ఓటర్ల జాబితాతో పోల్చితే ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా ప్రకారం 79,602 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన వార్షిక ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను అక్టోబర్ 29న కలెక్టర్ విజయేందిర విడుదల చేశారు. కలెక్టరేట్‌తో పాటు పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. దీని ప్రకారం జిల్లావ్యాప్తంగా 7,26,986 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,60,177 పురుషులు, 3,66,789 మహిళలు, 20 మంది ఇతరులు ఉన్నారు. ఈ ముసాయిదా ప్రకారం పురుష ఓటర్ల కంటే 6,612 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

■ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా మరోసారి అవకాశం కల్పించారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు నూతనంగా ఓటరు నమోదు, ఏవైనా మార్పులు చేర్పులతో పాటు ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదులు చేయవచ్చు. నవంబర్ 9, 10 తేదీలలో ఓటర్ నమోదుకు బూత్‌స్థాయిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఫారం–8 ద్వారా, ఫారం–6 ద్వారా నూతన ఓటరుగా నమోదుకై దరఖాస్తులు చేసుకోవాలి. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీలోగా పరిష్కరించి 2025 జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

యువత ముందుకు రావాలి

18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదుకు ముందుకు రావాలి. ఫారం– 6 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఫారం–7లో దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ 9, 10 తేదీలలో ఓటరు నమోదుకు బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తాం.
–విజయేందిర బోయి, కలెక్టర్



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఓటరునమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



భూత్పూర్ మున్సిపాలిటీలోని అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్/మూసాపేట: ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే సమగ్ర కుటుంబసర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం భూత్పూర్ మండలం శేరిపల్లి (హెచ్), మున్సిపాలిటీలోని 9వ వార్డు, మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి అధికారులకు, సిబ్బందికి ఇళ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను పరిశీలించారు. ఇళ్ల సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తూ, వాటిపై నమోదు చేస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. 6వ తేదీ నుంచి చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ప్రజల నుంచి పూర్తి వివరాలు జాగ్రత్తగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, పట్టణ పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. మూడు రోజుల్లో ఇంటి లిస్టింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చా. తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయులమనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, దేశ అంతర్గత భద్రతను పటిష్ఠ పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని అదనపు కలెక్టర్ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దేశ ఐకత్య ప్రతిజ్ఞ చేయిస్తున్నఅడిషల్ కలెక్టర్ మోహన్‌రావు

దరఖాస్తు గడువు పెంపు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం అర్హత పరీక్ష దరఖాస్తు గడువు గత నెల 30తో ముగియగా.. దానిని ఈ నెల 9 వరకు పెంచినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8వ తరగతి, 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తగిన గుర్తింపు పత్రాలతో www.navodaya.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిసెంబర్ 2 వరకు పోలీస్ 30యాక్ట్ అమలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో శాంతి భద్రతల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం కల్పించడంలో భాగంగా శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో డీఎస్పీ లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదని పేర్కొన్నారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, తుపాకులు ఇతర నేరాలకు ఉపయోగించే ఆయుధాలు వాడరాదని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే కార్యక్రమాలు చేపట్టరాదని, జనాలను జమ చేయడం, లౌడ్ స్పీకర్స్, డీజేలను వంటి ఏమాత్రం వాడడానికి వీల్లేదని పేర్కొన్నారు. పోలీస్ యాక్ట్ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే 30పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులని హెచ్చరించారు.

మహిళ రక్షణ కోసమే షీటీం బృందాలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో షీటీమ్స్ మహిళలకు, బాలికలకు భద్రత భరోసా ఇస్తున్నాయని విద్య సంస్థలతో పాటు రద్దీ ప్రదేశాల్లో నిరంతరం నిఘా పెట్టినట్లు ఎస్పీ డి. జానకి ఒక ప్రకటనలో తెలిపారు. గత అక్టోబర్ నెలలో మహిళలు, విద్యార్థులను వేధిస్తున్న పోకిరీలను షీటీం పోలీసులు అదుపులోకి తీసుకుని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.అక్టోబర్‌లో మొత్తం నాలుగు ఫిర్యాదులు రాగా ఇద్దరికి కౌన్సెలింగ్ చేయగా మరో రెండు ఘటనల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఇక 40 హాట్ స్పాట్ ఏరియాలను విజిట్ చేయడంతో పాటు 15 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినిల రక్షణ కోసం షీటీం బృందాలు ఏర్పాటు చేశామని, వేధింపులకు గురయ్యే వారు షీటీం సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు అత్యవసర సమయాల్లో 8712659365, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రేపటి నుంచి రాచాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



రాచాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అడ్డాకుల: 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలకు అడ్డాకుల మండలంలోని రాచాల జిల్లా పరిషత్ హైస్కూల్ ఆతిథ్యమివ్వనుంది. అండర్–17 బాలికల కబడ్డీ, అండర్–19 బాలుర కబడ్డీ విభాగానికి సంబంధించిన రాష్ట్రస్థాయి పోటీలను ఇక్కడ నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ కురుమూర్తి, జీహెచ్‌ఎం ఫయాజుద్దీన్, ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడాకారులకు వసతి సౌకర్యం, మైదానం ఏర్పాట్లపై ఆరా తీశారు. క్రీడాకారులకు మెరుగైన ఏర్పాట్లు చేయడానికి కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం రాచాలలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కురుమూర్తి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ఊరట

- డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, మేనేజ్‌మెంట్ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లోని 64 వేల మందికి ఫైగా మేలు



మహబూబ్‌నగర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, 3 నుంచి పీజీ వరకు హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం జీఓ విడుదల చేసింది. అలాగే 3 నుంచి ఎస్సెస్సీ వరకు సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కాస్మొటిక్స్ చార్జీలను సైతం పెంచింది. 2017లో చివరిసారిగా డైట్ చార్జీలను సవరించగా.. తాజాగా ప్రభుత్వం మరోసారి 30 శాతానికి పైగా పెంచింది. ఇందులో ముఖ్యంగా 3 నుంచి 7వ తరగతి వారికి గతంలో రూ.950 ఉండగా దీన్ని రూ.1,330కి పెంచింది. 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారికి గతంలో రూ.1,100 ఉండగా ప్రస్తుతం రూ.1,540గా పెంచింది. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి గతంలో రూ.1,540 ఉండగా ప్రస్తుతం రూ.2,100 వరకు పెంచింది.

■ కాస్మోటిక్ చార్జీలు 3 నుంచి 7 వరకు చదువుతున్న బాలికలకు గతంలో రూ.55 ఉండగా ప్రస్తుతం రెండు రెట్లు పెంచి రూ.175గా నిర్ణయించారు. 8 నుంచి 10 వరకు చదువుతున్న వారికి గతంలో రూ.75 ఇస్తుండగా ప్రస్తుతం రూ.275కు పెంచారు. బాలురు 3 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న వారికి గతంలో రూ.62 ఇస్తుండగా ప్రస్తుతం దాన్ని రూ.150, 8 నుంచి 10 వరకు చదువుతున్న వారికి గతంలో రూ.62 ఇస్తుండగా ప్రస్తుతం రూ.200లకు పెంచారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 105 ఎస్సీ హాస్టళ్లలో 11,200 మంది విద్యార్థులు ఉంటున్నారు. అలాగే 34 ఎస్టీ హాస్టళ్లు ఉండగా 5,800 మంది, 68 బీసీ హాస్టళ్లలో 8,900 మంది, 72 కేజీబీవీల్లో 18 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు 90కి పైగా ఉండగా ఇందులో 20 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. అలాగే పీయూ పరిధిలోని 4 హాస్టళ్లలో 960 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విషయమై బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర స్పందిస్తూ.. ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నిధులు త్వరలోనే విద్యార్థులకు అందించేలా చూస్తామన్నారు.

క్లుప్తంగా

డెంగీతో బాలుడు మృతి


శశివర్ధన్‌యాదవ్ (ఫైల్)

ఉప్పునుంతల: డెంగీ జ్వరంతో ఐదేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని మర్రిపల్లిలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మర్రిపల్లికి చెందిన రెడ్డమోని మల్లేశ్, హైమావతి దంపతులకు కుమార్తె, కుమారుడు శశివర్ధన్ యాదవ్ (5) ఉన్నారు. బాలుడికి పది రోజుల కిందట జ్వరం రావడంతో అచ్చంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించారు. మూడు రోజుల కిందట పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డెంగీగా నిర్ధారించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా.. గురు వారం రాత్రి మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

విద్యుదాఘాతంతో యువరైతు..


మల్యానాయక్ (ఫైల్)

బిజినేపల్లి: పంటను కాపాడుకోవడానికి ప్రయత్నించిన ఓ యువ రైతు తన ప్రాణాలనే కోల్పోయాడు. ఈ దుర్ఘటన మండలంలోని గంగారం పరిధి అలుగుతండాలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాత్లావత్ మల్యానాయక్(34) మరికొందరు రైతులతో కలిసి శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ సరిగా పనిచేయకపోవడంతో పరిశీలించేందుకు వెళ్లాడు. మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు మల్యానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే మిగతా రైతులు త్రుటిలో ప్రాణాల నుంచి బయటపడ్డారు. వెంటనే మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

లైన్‌మేన్ నిర్లక్ష్యం

వేరుశనగ పంటకు తడి ఇవ్వడానికి విద్యుత్ సరఫరా సరిగ్గా లేదని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేయాలని కొద్ది రోజులుగా మృతుడు మల్యానాయక్ లైన్‌మేన్‌ను అభ్యర్థించాడు. అప్పుడు ఇప్పుడు అంటూ లైన్‌మేన్ కాలయాపన చేయడంతో చేసేది లేక మల్యానాయక్ మరికొందరు రైతులతో కలిసి మరమ్మతు చేసేందుకు ప్రయత్నించి.. మృత్యువాత పడ్డాడు. అధికారులు సమయానికి స్పందించి ఉంటే ఈ రోజు ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఏఈ శ్రీకాంత్ స్పందిస్తూ తమ శాఖ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. రైతు కుటుంబానికి తగిన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామన్నారు.

వేరుశనగ మిషన్‌లో పడి మహిళా కూలీ..


రేణుక (ఫైల్)

కొత్తకోట రూరల్: ప్రమాదవశాత్తు వేరుశనగ మిషన్‌లో పడి ఓ మహిళా కూలీ మృతి చెందిన ఘటన గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెల్లిపెద్ద తండా గ్రామ పంచాయితీ పరిధిలో చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. నాటవెల్లిపెద్దతండాకు చెందిన రేణుక(30) దీపావళి రోజున గ్రామ సమీపంలోని ఓ రైతు పండించిన వేరుశనగను మిషన్‌లో వేసేందుకు కూలి పని కోసం వెళ్లింది. వేరుశనగ మిషనల్‌లో వేస్తున్న క్రమంలో మహిళ చీర మిషన్‌కు చుట్టుకుంది. దీంతో చీరతో పాటు ఆ మహిళను మిషన్ గట్టిగా లాగేడయంతో అందులో పడిపోయి.. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాములు నాయక్‌తో పాటు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. దీపావళి రోజు తండాలో మహిళ మృతి చెందడంతో విషాదం అలుముకుంది. మృతురాలి భర్త ఇచ్చిన పిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం వనపర్తి మార్చురీకి తరలించారు. ఈ మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి మహిళ..


లక్ష్మి (ఫైల్)

మహమ్మదాబాద్: గడ్డి మందు తాగిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గండేడ్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని బల్సూర్‌గొండ గ్రామానికి చెందిన లక్ష్మి (30) కుటుంబసభ్యులతో గొడవపడి పొలం దగ్గర ఉన్న గడ్డి మందు తాగింది. గుర్తించిన చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: రెండు రోజుల కిందట జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ గోవర్దన్ శుక్రవారం తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాల వరకు ఉంటుందని వివరించారు.

'కురుమూర్తి'కి తరలివచ్చిన భక్తులు


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవ పూజలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం అనంతరం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ పూజలతోపాటు అమావాస్య కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవిందనామ స్మరణ చేశారు. మెట్టు మెట్టుకు కొబ్బరికాయలు కొట్టి స్వామి చెంతకు చేరి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవ, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం రేవంత్‌రెడ్డికి దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి శుక్రవారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని సీఎం చెప్పారని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్థానిక విలేకరులకు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ప్రధాన అర్చకుడు వెంకటయ్య తదితరులున్నారు.

అలంకారోత్సవానికి భారీ బందోబస్తు


ఆత్మకూర్‌లో మేనేజరుతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూర్: కురుమూర్తిస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నిర్వహించే అలంకారోత్సవానికి పటిష్ఠ భద్రత కల్పిస్తామని, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు సహకరించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌బీఐ శాఖను సందర్శించి మేనేజర్ అబ్బాస్ అలీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో భద్రపర్చిన స్వామివారి స్వర్ణాభరణాలను ఉదయం 10.30 గంటలకు ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రారంభమవుతుందని.. బ్యాంకు నుంచి పరమేశ్వరస్వామి చెరువుకట్ట వరకు ఊరేగింపు కొనసాగుతుందని, అక్కడి నుండి ప్రత్యేక వాహనంలో ఆలయానికి తరలిస్తామని చెప్పారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 15 మంది ఏఎస్ఐలతో పాటు 80 స్థానిక, సీపీఎఫ్, సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ బందోబస్తులో పాల్గొంటారని వివరించారు. ఆయన వెంట సీఐ శివకుమార్, ఎస్ఐలు నరేందర్, సురేశ్, శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ముళ్లపొదల్లో నవజాత శిశువు


కిష్టంపల్లిలో ముళ్లపొదల్లో నవజాత శిశువు


జిల్లా ఆస్పత్రిలో శిశువుకు చికిత్స అందిస్తున్న వైద్యులు

- సకాలంలో గుర్తించడంతో దక్కిన ప్రాణాలు
- వనపర్తి జిల్లా కిష్టంపల్లిలో ఘటన

అమరచింత: అభం శుభం తెలియని రెండు, మూడు రోజుల నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో పడేశారు. అయితే స్థానికులు సకాలంలో గుర్తించడంతో పాప ప్రాణాలతో బయటపడి చికిత్స పొందుతున్న సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని కిష్టంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. కిష్టంపల్లి గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వెనకాల శుక్రవారం ఉదయం చిన్నపిల్ల ఏడుపు శబ్దం వినిపించడంతో సమీపంలో ఉన్న వారు వెతకగా ముళ్లపొదల మధ్య రక్తపు మడుగులో ఆడపిల్లను గుర్తించారు. వెంటనే విషయాన్ని పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులకు అందించారు. దీంతో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద, ఏఎస్ఐ జమీరుద్దీన్ అక్కడికి చేరుకుని గ్రామంలోని ఓ బాలింతతో పాలు పట్టించారు. అనంతరం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో శిశువును ఎవరు వదిలి వెళ్లారు.. సమీపంలోని గ్రామాల్లో మూడు రోజుల కిందట ఎవరెవరికి ప్రసూతి అయ్యిందనే విషయాలను తెలుసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

మాజీ మంత్రిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వన్‌టౌన్ పోలీసులు మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మరికొందరిపై పలు రకాల సెక్షన్స్ కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ అప్పయ్య వెల్లడించారు. రెండు రోజుల కిందట బీఆర్ఎస్ కార్యకర్త అరెస్టు నేపథ్యంలో మాజీ మంత్రితో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు స్టేషన్ బైఠాయించి ధర్నా చేశారని.. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఇబ్బంది కలిగిస్తూ, అనుచిత వ్యాఖ్యాలు చేసిన క్రమంలో బీఎన్ఎస్ 132,189(2),190,192,195(1),196, 292, 352 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మాజీ మంత్రితో పాటు మాజీ బీసీ కమిషన్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, పల్లె రవి, రాజు సాగర్, వరద భాస్కర్, కిషన్ పవార్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సత్యం యాదవ్,సుధాకర్, శివరాజ్, రమేష్, గణేష్, రాము, నర్సింహ, శరత్‌రెడ్డి, పాల సతీష్, ఇమ్రాన్, జమ్ములయ్యలపై కూడా కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

తప్పిన ప్రమాదం


ప్రమాద స్థలంలో ట్రావెల్స్ బస్సు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మోజర్ల స్టేజీ సమీపంలో ఉన్న బుర్రవాగు దగ్గర ఓ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి కోయంబత్తూర్‌కు బయలుదేరింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో మోజర్ల సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారు యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సుకు అడ్డంగా వచ్చింది. దీంతో బస్ డ్రైవర్ ప్రభాకర్ చాకచక్యంగా కారును తప్పించగా అదుపుతప్పి బస్సు రోడ్డు కిందకు దిగింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రావెల్స్ సిబ్బంది మరో బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులను పంపించివేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామ శివారులో ప్రధాన రహదారిలో గురువారం రాత్రి ఏడుదొడ్ల బాల్‌రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాజిపేట మండలంలోని బాజీపూర్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డికి వట్టెంలో కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. వ్యక్తిగత పనుల కోసం బయటకు రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇదిలా ఉండగా బాల్‌రెడ్డి కుమారుడు గతంతో రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయాడు.

పంట కాల్వలో పడి విద్యార్థి మృతి


సందీప్ (ఫైల్)

అయిజ: పండుగ పూట పంట కాల్వలో పడి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన రవి, శశికళ దంపతులకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. అయితే చిన్న కొడుకు సందీప్(11) అదే గ్రామంలో 5వ తరగతి చదువుతున్నాడు. గురువారం దీపావళి సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించడంతో తోటి చిన్నారులతో కలిసి ఆడుకునేందుకు గ్రామ సమీపంలో ఉన్న పంట కాల్వ దగ్గరకు వెళ్లాడు. నెట్టెంపాడు ప్రాజెకులో భాగంగా నిర్మించిన పంట కాల్వలో కాలుజారి పడి నీటిలో మునిగిపోయాడు. పక్కన ఉన్న చిన్నారులు ఇంటికి వెళ్లి విషయం చెప్పగా.. వారు వచ్చి వెతకగా సందీప్ మృతదేహం నీటిలో తేలి కనిపించింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరి దుర్మరణం


బోరు రవి (ఫైల్)


విస్లావత్ రవి (ఫైల్)

మహమ్మదాబాద్/గండేడ్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన గండేడ్ మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొండాపూర్‌కు చెందిన బోరు రవి (19) గ్రామం నుంచి సల్కర్‌పేట వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ అనుబంధ తండాకు చెందిన విస్లావత్ రవి (30) సల్కర్‌పేట నుంచి పగిడ్యాల్ వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. బోరు రవి తండ్రి బోరు మైబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

యువతిపై అత్యాచారయత్నం

ధరూరు: ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ.. కుట్టు మిషన్ నేర్చుకుంటోంది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడగా.. కేకలు వేస్తూ బయటకు వచ్చింది. దీంతో రెండు రోజులుగా గ్రామపెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు చేయగా.. ఫలించకపోవడంతో కేసు రేవులపల్లి పోలీసుల వద్దకు చేరింది. అయితే కొందరు నాయకులు కల్పించుకొని మరోసారి గ్రామంలో చర్చించుకుంటామని పోలీసులతో అన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఎస్ఐ షుకూర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: వనపర్తిలోని పాలకేంద్రం వెనక మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు సీఐ కృష్ణ, ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. చిట్యాల రోడ్డు పక్కన మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామని, గాంధీనగర్‌కు చెందిన ఈరపాగ రాముడు (39) గుర్తించినట్లు చెప్పారు. రాముడు అదృశ్యంపై గత నెల 29న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిసింగ్ కేసు నమోదవడంతో ఆయన అక్క ఎల్లమ్మకు సమాచారం ఇచ్చారు. అయితే గొంతు నులిమి చంపినట్లు అనుమానిస్తున్నామని, ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలోనే మండలంలోని అంకూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని విచారించగా.. అతను చిట్టి డబ్బుల విషయంలో రాములుతో గొడవపడి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని వివరించారు. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

అక్రమ కేసులకు బెదిరేది లేదు


మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పల్లె రవి తదితరులు

- కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలపై సామాజిక మధ్యమం వేదికగా ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కొలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందన్నారు. కేవలం పది నెలల పాలనలోనే ప్రజా వ్యతిరేకతను చూరగొందని.. అన్నిరంగాల్లో పూర్తిగా విఫమైందని, ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి అడ్డుకోవాలని చూస్తోందని వివరించారు. ఇచ్చిన హామీలన్నీ బూటకమని తేలిపోయిందని.. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లకపోవడం విచారకరమని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా బెదరరని.. పార్టీ అండగా ఉంటుందని వివరించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తనతోపాటు 8 మంది మాజీ కార్పొరేషన్ చైర్మన్లపై అక్రమ కేసులు నమోదు చేశారని, ఉద్యమ సమయంలోనే ఎవరికీ బెదరలేదని, ఈ ప్రభుత్వం పెట్టే కేసులకు బెదరమన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న 65 మంది పార్టీ కార్యకర్తలను అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆరోపించారు. సర్వేనంబర్ 523లో అంధుల ఇళ్లను కూల్చి వేశారని.. వెంటనే వారికి అక్కడే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు పల్లె రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, శివరాజు, దేవేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌గౌడ్‌తో ములాఖత్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని 523 సర్వే నంబర్‌లోని డబుల్ బెడ్‌రూం దొంగ పట్టాల వ్యవహారంలో అరెస్టయి జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌తో శుక్రవారం మాజీ స్పీకర్ మధుసూదనాచారి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

జడ్చర్లలో రెండిళ్లలో చోరీ

- 12.5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.1.10 లక్షల నగదు అపహరణ
- ఎసీ కెమెరాల డీవీఆర్ బాక్స్ కూడా..


చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు

జడ్చర్ల: దీపావళి పండుగ రోజున అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలో దొంగలు పెట్రేగిపోయారు. తాళం వేసిన రెండు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి, నగదతో పాటు సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్‌ను సైతం ఎత్తుకెళ్లారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని గంగాపూర్‌కు చెందిన పవన్‌కుమార్ పట్టణంలోని సరస్వతీనగర్‌కాలనీ సమీపంలో కొత్తగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. రక్షణ కోసం సీసీ కెమెరాలను సైతం బిగించారు. గురువారం దీపావళి పండుగ రోజు ఇల్లు, గేటుకు తాళం వేసి స్వగ్రామమైన గంగాపూర్‌కు వెళ్లారు. అర్ధరాత్రి వరకు తన మొబైల్‌లో సీసీ కెమెరాలను చూసి తర్వాత పడుకున్నారు. శుక్రవారం ఉదయం జడ్చర్లకు వచ్చి చూసే సరికి గేటు, ఇంటి తలుపుల తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా వస్తువులు, కప్‌బోర్డులోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కప్‌బోర్డులో దాచిన 12 తులాల బంగారు నగలు ,రూ.10 వేల నగదును దొంగలు అపహరించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్, వైఫై బాక్స్‌లను సైతం ఎత్తుకెళ్లారు.

- పవన్‌కుమార్ ఇంటి సమీపంలోనే తిమ్మాజీపేట మండలం బలాన్‌పల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. పండుగ నిమిత్తం తన ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. దొంగలు తాళాలు విరగ్గొట్టి 30 తులాల వెండి వస్తువులతో పాటు అర తులం బంగారం, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించగా సీఐ ఆదిరెడ్డి ఘటన స్థలాలను పరిశీలించారు. సమీపంలోని ఇళ్ల వద్ద బిగించిన సీసీ కెమెరాల్లోని పుటేజీలను సీఐ వీక్షించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నడుం బిగించాలి


పెద్దధన్వాడలో మాట్లాడుతున్న నాయకులు

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో నెలకొల్పనున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నడుం బిగించాలని ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పెద్దధన్వాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ వల్ల గ్రామాల్లో కలుషిత వాతావరణం ఏర్పడుతుందని, భవిష్యత్ అంధకారంలో పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ గ్రామాలను కాపాడుకునేందుకు ముందుకు రావాలని, స్వచ్ఛందంగా కార్యక్రమాల్లో పాల్గొని తమ వ్యతిరేకతను తెలియచేయాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: బావిలో స్నానానికి వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపుంర మండలంలోని మానాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్తగొల్ల శ్రీనివాసులు (42) గురువారం ఉదయం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ఉన్న బావిలో స్నానం చేసేందుకు దూకాడు. బయటకు రాకపోవడంతో అక్కడే ఈత కొట్టేందుకు వచ్చిన కొందరు యువకులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు బావిలో వెదికి శ్రీనివాసులు మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య కొత్తగొల్ల శశికళ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సురేశ్‌గౌడ్ వివరించారు.

నీటికుంటలో పడి మరొకరు..

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మానాజీపేట గ్రామానికి చెందిన సామల నాగరాజు (49) శుక్రవారం తన పొలం దగ్గర నీటి కోసం తవ్విన కుంటలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు బురదలో ఇరుక్కొని మృతిచెందాడు. నాగరాజుకు భార్య నిర్మల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఈ విషయాన్ని ఎస్ఐ సురేశ్ వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విదేశీ మద్యం ఎలాతెచ్చారు?

- పార్టీకి మద్యం ఎవరు సరఫరా చేశారు..?
- చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డిల విచారణ


విచారణకు వచ్చిన రాజ్ పాకాల

చేవెళ్ల: రాయల్టీ చెల్లించకుండా విదేశీ మద్యం ఎలా తీసుకొచ్చారు..స్టాంప్ డ్యూటీ చెల్లించారా ? పార్టీకి మద్యం సరఫరా ఎవరు చేశారు.. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? పార్టీలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? పార్టీలో మద్యం పంపిణీ చేసినా పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు అంటూ పలు అంశాలపై కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను ప్రశ్నించినట్లు తెలిసింది. అనుమతి లేకుండా పార్టీ నిర్వహించాడనే కేసులో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల శుక్రవారం విచారణ నిమిత్తం చేవెళ్లలోని ఎక్సైజ్ కార్యాలయానికి హాజరయ్యారు. జన్వాడలోని ఆయన ఇంటి పక్కనే ఉండే నాగేశ్వర్‌రెడ్డి విల్లాలోనూ విదేశీ మద్యం దొరకడంతో ఆయనకూ నోటీసులు అందజేయగా, ఆయన కూడా చేవెళ్లకు వచ్చారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్, చేవెళ్ల సీఐ శ్రీలత తదితరులు రాజ్‌పాకాల, నాగేశ్వర్‌రెడ్డిలను విచారించారు. అడ్వకేట్ల ఎదుట నిర్వహించిన విచారణకు సంబంధించిన వీడియోలు తీసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం 1:40 నుంచి రాత్రి 8:10 వరకు విచారణ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు రాజ్‌పాకాలను, ఆ తర్వాత నాగేశ్వర్‌రెడ్డిని విచారించారు. అనంతరం రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి ఒకేసారి న్యాయవాదులతో కలిసి బయటకు వచ్చారు. అయితే ఇంట్లో నిర్వహించే చిన్నపాటి దావత్ అయినందున.. తమ మేనేజర్ ఈ విషయాలు చూసుకున్నారని రాజ్ పాకాల చెప్పినట్లు సమాచారం. విచారణ జరిగినంత సేపు మీడియాతోపాటు ఇతరులెవరినీ లోనికి అనుమతించలేదు. బయటకు వచ్చిన అనంతరం రాజ్ పాకాల మాట్లాడుతూ.. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాం. ఇంట్లో నిర్వహించిన చిన్నపాటి దావత్‌ను మా మేనేజర్ చూసుకున్నారు. పార్టీలో లోకల్ మద్యం సర్వ్ చేశామన్నారు.

కేసు ఇన్వెస్టిగేషన్‌లో ఉంది

ఈ కేసు ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్‌లో ఉంది. రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి విచారణకు సహకరించారు. కేసు కంటిన్యూ అవుతోంది. కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి వివరాలేవీ చెప్పలేం. **–దశరథ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్**


సిరిసిల్ల జిల్లా రంగంపేటలో గ్రామంలో తడిసిన వరి ధాన్యం


మంచిర్యాల జిల్లా మామిడిపల్లి శివారులో నేలవాలిన వరిపైరు


దుబ్బాక మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

నోటికందే కూడు నీటిపాలు!

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలతో నేలవాలిన వరి

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం.. ఇరవై రోజులుగా కొనుగోళ్లు లేక ఎక్కడికక్కడ ధాన్యం కుప్పలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- పిడుగుపాటుతో ఇద్దరు మృతి

మెదక్/ సిరిసిల్ల/ వీర్నపల్లి/ రుద్రంగి/ నిర్మల్/ వాజేడు: ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నీటి పాలవగా.. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరిపంట పొలాల్లోనే నేలకొరిగింది. దీనితో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి ఇన్నిరోజులైనా ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదని.. వర్షాలతో తమ ధాన్యం తడిసి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆరిపోయి తేమశాతం తగ్గిన వడ్లు కూడా వర్షానికి తడిశాయని, మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతీ గింజ కొంటామని ప్రభుత్వం ప్రకటించిందని.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడుతున్నారు.

తడిసిపోయిన ధాన్యం..: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 156 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. వీర్నపల్లి, రుద్రంగి మండల కేంద్రాల్లో టార్పాలిన్లు లేకపోవడంతో వడ్లు తడిసిపోయాయి. రుద్రంగి మండలం పరిధిలో రైస్‌మిల్లర్లు ధాన్యం దింపుకోబోమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు.

- మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. దుబ్బాక, మెదక్, నర్సాపూర్, కొల్చారం, చిన్నశంకరంపేట, కొడిపల్లి, చిలప్‌చెడ్, నిజాంపేట, హత్నూర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం నీటిపాలైంది. వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.
- నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం గంటకు పైగా వాన కురిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి వరద చేరింది. కుంటాల మండలంలో కోతకు వచ్చిన వరి నేలవాలింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి, జైపూర్ మండలాల్లో సుమారు 4,000 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. భీమిని, కన్నెపల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పత్తి తడిసిపోయింది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రాష్ట్రంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం దమ్మన్నపేటలో పత్తి ఏరుతుండగా పిడుగుపడి గడ్డం నాగమ్మ (26) అనే మహిళ మృతి చెందింది. ఇక ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురంలో వ్యవసాయ భూమిలో ఎడ్లను మేపుతుండగా పిడుగుపాటుకు గురై సొనప నవీన్ (24) మృ

సెటిల్‌మెంట్ అని పిలిపించి..

కారుతో తొక్కించి

మాజీ కానిస్టేబుల్ ఈశ్వర్‌పై హత్యాయత్నం

ఏళ్లుగా జేబుదొంగల గ్యాంగ్‌లు నిర్వహిస్తున్న ఈశ్వర్.. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలు

ఈ వ్యవస్థీకృత దందాలో ఇతడిదే పూర్తి ఆధిపత్యం.. దీంతో ముఠా నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు

'దొంగలతో దోస్తీ' ఆరోపణలపై పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన మేకల ఈశ్వర్‌పై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. వ్యవస్థీకృతంగా జేబు దొంగల ముఠాలు నడిపే ఈశ్వర్‌కు, ఆ ముఠాలకు చెందిన మరికొందరు నాయకుల మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా తమిళనాడులో ఉంటూ తెలంగాణ వ్యాప్తంగా సెల్‌ఫోన్ జేబు దొంగల ముఠాలు నిర్వహిస్తున్న ఇతడిని సెటిల్‌మెంట్ కోసమని పిలిచిన నలుగురు కీలక నిందితులు కారుతో ఢీ కొట్టారు. అతడి పైనుంచి రెండుసార్లు వాహనాన్ని నడపటంతో ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. మీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఈ ఘటన జరగ్గా.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలిసింది. – సాక్షి, హైదరాబాద్

కక్ష కట్టి, సెటిల్‌మెంట్ అంటూ పిలిచి..

ఇలాంటి కొన్ని ముఠాలపై ఈశ్వర్ గుత్తాధిపత్యం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నగరంలో మరే ఇతర ముఠాకు 'పనివారు' దొరకుండా చేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆధిపత్య పోరు పెరిగిపోగా ఎవరైనా అతికష్టమ్మీద వేరే ప్రాంతం నుంచి దొంగల్ని పట్టుకుని వస్తే, ఈశ్వర్ తనకున్న పాత పరిచయాల ద్వారా పోలీసులకు సమాచారం చేరవేస్తూ వాళ్ల అరెస్టు అయ్యేలా చేస్తున్నాడు. దీంతో కక్షకట్టిన నాలుగు ముఠాలకు చెందిన నాయకులు అతనిపై హత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని ఓ బార్‌కు అతన్ని పిలిచిన నలుగురు నిందితులు.. కొద్దిసేపు వాగ్వాదం తర్వాత తమ ప్రతిపాదనల్ని తిరస్కరించి, బెదిరించి వెళ్లిపోతున్న ఈశ్వర్‌పై కారుతో ఢీ కొట్టి హత్యాయత్నం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు చిట్టీల వ్యాపారంలో విభేదాల వల్లే ఈశ్వర్‌పై హత్యాయత్నం చేశామంటూ మీర్‌పేట పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలుస్తోంది. దీంతో రాచకొండ పోలీసులు ఈ కేసును వివిధ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ వర్క్ చేస్తూ క్రిమినల్స్‌తో నెట్‌వర్క్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల ఈశ్వర్ 2010లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో అడుగుపెట్టాడు. ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి, బేగంపేట పోలీసుస్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్‌లోనూ పని చేశాడు. మొదట్నుంచీ నేరాలకు సంబంధించిన విధులే నిర్వర్తించిన ఇతను.. అప్పట్లో చోరీ చేసిన ఫోన్లు ఖరీదు చేసే వాళ్లను బెదిరిస్తూ దందా మొదలెట్టాడు. తనకున్న పరిచయాలను వినియోగించుకుని చోరీకి గురైన ఫోన్ల ఐఎంఈఐ నంబర్లు సేకరించేవాడు. వాటి ఆధారంగా అవి ప్రస్తుతం ఎవరు వాడుతున్నారో గుర్తించేవాడు. విషయం తెలియక సెకండ్ హ్యాండ్ మార్కెట్లలో చోరీ ఫోన్లు కొనుగోలు చేసి వాడుతున్న వారిని పిలిచి బెదిరించేవాడు. ఫోన్ తీసుకోవడంతో పాటు కేసు పేరుతో భయపెట్టి కనీసం రూ.25 వేలు వసూలు చేసేవాడు. రికవరీ చేసిన ఫోన్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకునే వాడు. ఇలా మొదలైన ఈశ్వర్ దందా పెద్ద నెట్‌వర్క్‌గా మారింది.


ఈశ్వర్

వసతులు, 'జీతాలు' ఇచ్చి నేరాలు

చోరీ ఫోన్ల మార్కెట్‌పై పట్టు లభించడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్న స్నాచర్లు, దొంగలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఓ ప్రాంతానికి చెందిన వారిని మరోచోటుకు పంపేవాడు. అక్కడ వారికి అద్దె ఇంటిలో వసతి కల్పించేవాడు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు ఫోన్లు కొట్టేయాలనే టార్గెట్ పెట్టేవాడు. వీటిలో ఒక ఫోన్‌ను విలువను లెక్కించి ఆ మొత్తాన్ని జీతం కింద వారికి ఇచ్చేవాడు. ఇక ఈ ఫోన్లను విక్రయించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో ఉన్న సెకండ్ హ్యాండ్ మార్కెట్లలోని వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. వీరినుంచి ప్రతినెలా మామూళ్లు కూడా వసూలు చేసేవాడని తెలిసింది. మరోవైపు సెల్‌ఫోన్లతో పాటు బంగారు నగలనూ స్నాచింగ్ చేయించేవాడు. 2022లో నల్లగొండ పోలీసులు ఈ తరహా ఓ కేసులో ఈశ్వర్‌ను అరెస్టు చేయడంతో హైదరాబాద్ పోలీసులు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు.

తల్లిదండ్రులకు అప్పులిచ్చి పిల్లలతో దందా

హైదరాబాద్‌లో ఫోన్ల దొంగతనం, విక్రయం దందా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. కొన్నాళ్లుగా వీళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. తల్లిదండ్రులకు భారీ మొత్తం అప్పు ఇవ్వడం ద్వారా వారి పిల్లలతో హైదరాబాద్ సహా దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాల్లో దందా చేయిస్తున్నారు. వీరికి వసతి కల్పించడంతో పాటు ఆహారం, మద్యం సరఫరా చేయడమే కాకుండా ప్రతిరోజూ రూ.300 ఖర్చుల కోసం ఇస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, బస్సులు, సభలు, సమావేశాల్లో సెల్‌ఫోన్ల చోరీ వీరి పని. ఈ ముఠాల్లో అప్పులు తీసుకున్న మహిళలు కూడా ఉన్నారు. వీరు తమ చిన్నారులతో కలిసి బంగారం, ఇతర దుకాణాలకు వెళ్లి, యజమానులు వర్కర్ల దృష్టి మళ్లించి చోరీలు చేస్తుంటారు. వీరు ప్రతిరోజూ నిర్దిష్ట సంఖ్యలో చోరీలు చేయాలనే షరతు ఉంది. కాగా చోరీ చేసిన సొత్తులో కొంత మొత్తం వారి అప్పులో అసలు, వడ్డీ జమ చేసుకుంటారు. ఇలా అప్పు తీరే వరకు వీరంతా ముఠా నాయకుల కోసం పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి నగరంలో పలు ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు సాయిబాబా స్మారక సభ

పాలమూరు: జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాలులో ఈనెల 3న ప్రముఖ ప్రజాస్వామ్యవాది, పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మారకసభ నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబా జీవిత పోరాటం అనే అంశంపై నిర్వహించే సభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని సూచించారు. నేరం రుజువు కాకుండా పదేళ్ల పాటు జైలులో కఠిన కారాగార శిక్ష అనుభవించాడని తెలిపారు. కవులను, రచయితలను, మేధావులను జైలులో నిర్బంధించి బీజేపీ ఫాసిస్టు విధానాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. సాయిబాబా స్మారక సభకు ప్రొఫెసర్ హరగోపాల్, సాయిబాబా కూతురు మంజీర, పాణి, రవిచంద్ర హాజరవుతారని తెలిపారు.

4న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ధర్మాపూర్ రోడ్డులోని అల్‌మదీనా క్యాంపస్‌లో ఈనెల 4వతేదీన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 విభాగాల సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులు ఇంటర్ ఒరిజినల్ బోనఫైడ్, ఎస్‌ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. వివరాల కోసం నాగరాజు 7013687785 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

4న యోగా ఎంపికలు

జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ మెయిన్ స్టేడియంలో ఈనెల 4వ తేదీన అండర్–19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి పాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఒరిజినల్ బోనఫైడ్, ఎస్‌ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీఈటీ బాల్‌రాజు 9440292044 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అల్లుడి దాడిలో గాయపడిన అత్త.. చికిత్సపొందుతూ మృతి

దేవరకద్ర రూరల్: కుమార్తెను కాపాడేందుకు వెళ్లి అల్లుడి చేతిలో తీవ్రంగా గాయపడిన అత్త నిర్మలమ్మ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. గత నెల 27న గుడిబండలో భార్యపై వేట కొడవలితో భర్త కురుమూర్తి దాడి చేసిన క్రమంలో నిర్మలమ్మ తీవ్రంగా గాయపడింది. నిందితుడు మదనాపురం మండలం కొన్నూరుకు చెందిన కురుమూర్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.


కాల్వలో కొట్టుకుపోతున్న యువకుడు


తాడు సహాయంతో ఒడ్డుకు లాగుతున్న జాలర్లు, యువకులు


బతికి బయటపడ్డ యువకుడు

జాలర్ల చాకచక్యం.. నిలిచిన ప్రాణం

మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు జూరాల కాల్వలో పడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా.. జాలర్లు, కొందరు యువకులు చాకచక్యంగా వ్యవహరించి యువకుడిని కాపాడారు. ఈ ఘటన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ వద్ద గురువారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. జూరాల కాల్వ సమీపంలో చేప వంటలు ఆరగించేందుకు, మద్యం సేవించేందుకు కొందరు యువకులు ఇక్కడికి వచ్చారు. ఈక్రమంలో రాజంపేట తండాకు చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో జూరాల కాల్వ వద్దకు చేరుకోగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో యువకుడు కొట్టుకుపోసాగాడు. అక్కడే ఉన్న కొందరు జాలర్లు, యువకులు అప్రమత్తమయ్యారు. చేపల వలతో పాటు తాడును కాల్వలో వదిలి వాటిని పట్టుకొమ్మని చెప్పడం.. రెండు మూడు ప్రయత్నాల అనంతరం యువకుడు తాడును పట్టుకోవడంతో ఎట్టకేలకు ఒడ్డుకు లాగడంతో ప్రాణాపాయం తప్పింది. – అమరచింత

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాది పడుతుందని, తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడికి పంపాలని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపురంలో బడిబయట పిల్లలపై తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి గట్టు, కేటీదొడ్డి మండలంలో విద్యాపరంగా వెనకబడ్డాయని, వచ్చే ఏడాదిలోగా చదువులో ముందుకు వెళ్లేలా చర్యలు తీసకోవాలని సూచించారు. సమావేశంలో ఎంవీఎఫ్ ఫౌండేషన్ వెంకట్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్త హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా కళాశాలలు


సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి


స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న భవిష్యత్ తరాలకు వందేళ్లకు పైగా ఉపయోగపడేలా పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు కానున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో రెండు యూనివర్సిటీలకే రూ.100 కోట్లు మంజూరయ్యాయని, వాటిలో పీయూ ఒకటని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఒక విజన్‌లా పని చేస్తున్నారని కొనియాడారు. పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు కోసం 9 నెలల నుంచి ఎమ్మెల్యే ఎంతో శ్రమించారని, కేబినెట్ సమావేశంలో పెట్టించిన ఘనత ఎమ్మెల్యే యెన్నంకు దక్కుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మంజూరు చేయించుకోవడంలో ఎమ్మెల్యే తనవంతు పాత్ర పోషించారని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని జైపాల్‌రెడ్డి మెమోరియల్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారని అన్నారు. దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంటలో కస్తూర్బా ఒకేషనల్ జూనియర్ కళాశాల మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన సొంత డబ్బులతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్‌లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజాపాలనలో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సీజే బెనహర్, గట్టు వెంకట్‌రెడ్డి, ఏర్పుల నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మరో పోరాటం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్

మహబూబ్‌నగర్ రూరల్: షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న 59 కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అందించేలా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగలు పోరాటం చేస్తుంటే, మాలలు ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి కుట్రలు చేయడం దారుణమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల జనాభాలో అత్యధిక జనాభా ఉన్నప్పటికీ తగినన్ని అవకాశాలు మాదిగలకు రాలేదని అన్నారు. అందుకే మాదిగలు మందకృష్ణ నేతృత్వంలో 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని అన్నారు. ఈ పోరాట ఫలితంగానే న్యాయాన్ని గుర్తించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని తెలుపుతూ చారిత్రక తీర్పును ఇచ్చిందని అన్నారు. ఈ తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమైందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ మీద తీర్పు ఇచ్చిన తర్వాత కూడా కొంతమంది మాల సామాజిక వర్గంలోని స్వార్థపరులు ఇప్పటికీ అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకొచ్చేంత వరకు అన్ని రకాల ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న మహబూబ్‌నగర్‌లో ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మ యుద్ధ సభను నిర్వహిస్తున్నామని, ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య, నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

నిలిచిన నెట్టెంపాడు నీటి పంపింగ్


నిలిచిన నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

జూరాలకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శుక్రవారం సాయంత్రం ప్రాజెక్టుకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం ప్రాజెక్టు నుంచి 21,919 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం నీటి పంపింగ్‌ను నిలిపివేశారు. భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 72 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు – 2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 25,231 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 880.9 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 880.9 అడుగుల వద్ద 192.9694 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 28,629 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 21,189 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 20,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,510, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 15.390 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శుక్రవారం ఎగువ నుంచి 9,540 క్యూసెక్కుల రాగా.. రెండు గేట్లను తెరిచి 6,710 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.